ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు

దేశ సమైక్యతకు యువత కీలకం

● భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కడపకల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు, విలువలు కాపాడుకోవడానికి నేటి యువత కీలక పాత్ర పోషించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) శత జయంత్యుత్సవం సందర్భంగా ఆదివారం కడప నగరం ఎర్రముక్కపల్లెలోని సీపీబ్రౌన్ గ్రంథాలయం ఆవరణంలో 14వ సాహిత్య, గ్రంథాలయ సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు అధ్యక్షుడిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించగా, గౌరవ అతిథిగా జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ హాజరయ్యారు. అనంతరం సభనుద్దేశించి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఒక విదేశీయుడు మన రాష్ట్రానికి వచ్చి తెలుగుభాషకు కృషి చేసినందుకు శత కోటి అభినందనలు తెలిపారు. ప్రతి ఊరికి ఒక దేవాలయం, విద్యాలయం, సేవాలయం, గ్రంథాలయం నెలకొల్పేలా సమాజంలో ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. మనం అడగకుండానే మనతో సహజీవనం చేస్తున్న ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితం ఆస్వాదించవచ్చన్నారు. ప్రధానంగా మన కట్టు, బొట్టు మన సంస్కృతి, సాంప్రదాయలు, వేషభాషలు, యాస కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. మాతృభాషలోనే పాఠ్యాంశాలు పరిపాలన ఉత్తర్వులు ప్రత్యుత్తరాలు సాగాలని, న్యాయమూర్తులూ తమ వాదనలను తెలుగులోనే వాదించాలని విన్నవించారు. ప్రధాని నరేంద్రమోదీ ఉన్నత విద్యను స్వదేశీ భాషలోనే విద్యనందించేలా సమాలోచనలో ఉన్నారన్నారు. తెలుగుజాతికి విశిష్ట సేవలందిస్తున్న సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్ర గ్రంథాలయ అభివృద్ధిని కోరుతూ తన కుమార్తె నిర్వహిస్తున్న స్వర్ణభారతి ట్రస్టు నుంచి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం తెలుగుసాహితీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాల కృష్ణ, అవధాన ప్రముఖులు మేడసాని మోహన్, లక్షలాది గ్రంథాల సంరక్షకుడు మరె అంకెగౌడ, ప్రముఖ సాహితీవేత్త రేవూరు అనందపద్మనాభలకు పురస్కారాలు అందజేశారు. అలాగే 2025 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కడప బాలవికాస్ పాఠశాల విద్యార్థులు గౌసియా, మీనా సహనా, ప్రదీప్‌కుమార్, గీతిక, రిహానాతో పాటు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించిన చిత్రకారుడు ఆనంద్‌రాజ్‌కు సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప పాల్గొన్నారు.

భాషా సాహితీ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

భాషా సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భారత మాజీ ఉప రాష్ట్రపతి పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రెండురోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక సీపీబ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈయన వెంట రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, కలెక్టరు చెరుకూరి శ్రీధర్, వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, జానమద్ది విజయభాస్కర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకురాలు పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.



జానమద్ది హనుమచ్ఛాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జానమద్ది విజయభాస్కర్ తదితరులు



ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలక్రిష్ణ, మేడసాని మోహన్, అనంత పద్మనాభ, అంకెగౌడ

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

కడప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థలో మొట్టమొదటిసారిగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల అనంతపురం సత్యసాయి జిల్లాల వినియోగదారులు మొబైల్ నెం.8977716661కు కాల్ చేయడం ద్వారా తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులు నెం.9133331912కు చాట్ చేయడం ద్వారా కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

హాస్టళ్లలో మెనూ పాటించండి : ఎమ్మెల్సీ



వసతిగృహంలో బాలికలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో మెనూ తప్పకుండా పాటించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని నగరిగుట్ట ఎస్టీ బాలికల వసతి గృహాన్ని అనంతరం ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ (ఏపీటీడబ్ల్యూఆర్) స్కూల్‌ను ఎమ్మెల్సీ పరిశీలించారు. ముందుగా ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ప్రభుత్వం చెప్పిన విధంగా అన్నీ అందిస్తున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. అందుకు విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, పాలు మరీ పలుచగా చక్కెర లేకుండా ఇస్తున్నారని వివరించారు. బాత్‌రూములు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగేందుకు బోరువాటర్ ఇస్తున్నారని విద్యార్థినిలు ఎమ్మెల్సీ ముందు వాపోయారు. దీంతో ఎమ్మెల్సీ హాస్టల్ వార్డన్ సుజాతతో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించాలని, వర్షాకాలంలో విద్యార్థినిలకు వేడి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వంట చేసే వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్‌ను ఎమ్మెల్సీ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వంట గది, భోజనశాల, విద్యార్థుల తరగతి గదులు, బాత్‌రూములను ఆయన పరిశీలించారు. కోడిగుడ్లు ఇవ్వడం లేదని, ఆహారంలో నాణ్యత కొరవడిందని విద్యార్థులు ఎమ్మెల్సీకి సూచించారు. విద్యార్థులపై నిర్లక్ష్యం చూపుతున్నారని, ప్రిన్సిపల్, వార్డన్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మోపూరి దేవస్థానం చైర్మన్ ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చస్తే.. ఉన్నోళ్లకు చావే..!

● ఆరడుగుల స్థలం కోసం అవస్థలు

రాజుపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మనిషి చనిపోయాక ఆరడుగుల స్థలం కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో అవస్థలు పడే దుస్థితి ఇప్పటికీ ఉంది. బతికున్నన్నాళ్లు ఎన్ని కష్టాలు పడ్డా.. చివరి మజిలీలోనైనా సంతోషంగా సాగనంపలేక మృతుల కుటుంబీకులు మనోవేదనకు గురవుతున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని టంగుటూరు ఎస్సీ కాలనీలో దాదాపు 250 కుటుంబాలు (దాదాపు వెయ్యిమంది) పైబడి ఉన్నారు. వీరికి గత 20 ఏళ్లుగా శ్మశాన స్థలం లేకపోవడంతో కాలనీ నుంచి దాదాపు అర కి.మీ. దూరంలో ఉన్న కుందూలోనే భూస్థాపితం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఓ మహిళ మృతిచెందింది. ఈ మృతదేహాన్ని కుందూలో భూస్థాపితం చేసేందుకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో భూయజమానుల దయాదాక్షిణ్యాలతో పంటపొలాల మధ్య నుంచి తీసుకెళ్లి కుందూలో భూస్థాపితం చేశారు. తమ కుటుంబీకులు ఎవరైనా చనిపోయినా తమకు చావేనని ఆవేదన చెందారు. ఎన్నికల సమయంలో ఆర్భాటం చేసే నాయకులు ఆ తర్వాత కనిపించరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ కాలనీకి వచ్చి ఆరాతీశారే కానీ ఫలితం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని ఎస్సీ కాలనీకి శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



పంట పొలం మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం

హార్సిలీహిల్స్‌లో సండే సందడి

● పర్యాటకులతో కళకళ లాడిన కొండ

బి.కొత్తకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. బెంగళూరు వైపు నుంచి వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల బృందాలు, జంటలు, యువకులు పెద్ద ఎత్తున హిల్స్‌కు చేరుకొని బస చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వచ్చారు. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉండటంతో హిల్స్‌కు వచ్చిన పర్యాటకులకు తియ్యని అనుభూతి మిగిలింది. గాలిబండ, పాత, కొత్త వ్యూ పాయింట్లు నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తూ, ఫారెస్ట్ క్యాంపస్‌లో ఫొటో షూట్, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.




హార్సిలీహిల్స్‌లోని అటవీశాఖ ప్రాంగణంలో పర్యాటకులు

ఆదివారం ఆటవిడుపు..



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

వాల్మీకిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిత్యం ఉద్యోగం.. బాధ్యతలు.. ప్రజల రక్షణ కోసమే రాత్రింబవళ్లు శ్రమించే పోలీసులు ఆదివారం ఆటవిడుపుగా క్రికెట్ ఆడారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందికి క్రికెట్ ఆడటానికి జీవీఎస్ సీఎస్ మైదానం వేదికైంది. ఉదయం 9.30 గంటలకు రాయచోటి పోలీస్ లెవెన్, మదనపల్లె పోలీస్ లెవెన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిసి బ్యాటింగ్ ఎంచుకున్న రాయచోటి పోలీస్ లెవెన్ జట్టు 19.5 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. రాయచోటిలో జట్టులో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆడారు. బ్యాటింగ్ చేసి 10 పరుగులు చేయడమే కాకుండా బౌలింగ్ చేసి ఒక వికెట్ కూడా తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మదనపల్లె పోలీస్ లెవెన్ జట్టు 20 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. రాయచోటి పోలీస్ లెవెన్ జట్టు విజయం సాధించింది. మదనపల్లె పోలీస్ జట్టులో జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజారమేష్ 51 పరుగులు చేశారు. అనంతరం స్థానిక వీసీసీ అధ్యక్షుడు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, జిల్లా క్రికెట్ కోచ్ సునీల్ కుమార్‌లు ఎస్పీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. క్రికెట్ పోటీలు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించ డం ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. వా ల్మీకిపురం వాతావరణం, క్రీడాకారుల అభిమానం సంతోషాన్నిచ్చాయన్నారు. కార్యక్రమాలలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజారమేశ్, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది మోహన్‌బాబు, కేశవ, సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



విదేశాల రోడ్లను తలపించేలా..

● మదనపల్లె-తిరుపతి రహదారిలో దూసుకుపోతున్న వాహనాలు



మదనపల్లె-వాల్మీకిపురం మధ్య సీటీఎం చెరువు వద్ద విశాలంగా కనిపిస్తున్న జాతీయ రహదారి

మదనపల్లె టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూశారా.. ఇదేదో అభివృద్ధి చెందిన విదేశాల్లో కనపడే జాతీయ రహదారి అనుకుంటే పొరపాటు పడినట్లే. ఇటీవల ప్రారంభించిన మదనపల్లె-తిరుపతి ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల జాతీయ రహదారి. మదనపల్లె నుంచి సీటీఎం చెరువు మీదుగా కొండను తొలచి నిర్మించిన ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి కొత్త అనుభూతులు కనిపిస్తున్నాయి. నాలుగు లేన్ల జాతీయ రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లతో విదేశాల్లో రోడ్లను తలపిస్తున్నాయి. 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో సర్రున ప్రయాణిస్తున్న కార్లు మదనపల్లె నుంచి భాకరాపేట వరకు 72 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 45 నిమిషాల్లో గమ్యం చేరుకుంటున్నారు.

మాక్ అసెంబ్లీకి మోడల్ స్కూల్ విద్యార్థిని



సుహానా

తంబళ్లపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం నవంబరు 26న అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి నియోజకవర్గం నుంచి తంబళ్లపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని సుహానా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈనెల 1వ తేదీ అంగళ్లు ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్.సుహానా ద్వితీయ స్థానం సాధించి మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్: డీఆర్వో

కడప కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అర్జీదారులు తమ విన్నపాలు సమర్పించి పరిష్కారం పొందాలని కోరారు. ఉదయం 9-30 గంటలకు డయల్ యువర్ కలెక్టర్, 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గతంలో అర్జీలు సమర్పించిన వారు తమ సమస్యలు పరిష్కారం కాకుంటే 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

కడపలో క్రికెట్ ఫీవర్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారిణి

కడపస్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా వరల్డ్ కప్ ఫైనల్‌కు ఇండియా మహిళా జట్టు చేరుకోవడంతో కడపలో అభిమానుల ఆనందానికి అవధులు లే కుండా పోయాయి. ఆ క్రమంలో ఆదివా రం సౌత్‌ఆఫ్రికా జట్టుతో ఇండియా మ హిళా జట్టు తలపడింది. ఈ నేపథ్యంలో అభిమానులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు అనువుగా కడప నగరం రాజీవ్ పార్కు వద్ద బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా మహిళా జట్టు 50 ఓవర్లలో 298 పరుగులు చేసింది. జట్టు క్రీడాకారిణిలు సిక్స్‌లు, ఫోర్‌లు కొట్టినప్పుడల్లా అభిమానులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ఇక చిన్నారులు స్టెప్పులతో అదరగొట్టారు.



రాజీవ్‌పార్కు వద్ద క్రికెట్ చూస్తున్న అభిమానులు



స్టెప్పులేస్తున్న చిన్నారులు

కనులపండువగా బ్రహ్మంగారి కల్యాణం

● భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం ● వైభవంగా స్వామివారి జయంతి మహోత్సవం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణం కనులపండువగా సాగింది. అంతకుముందు సుప్రభాత పారాయణం, నిత్యపూజలు, సర్వదేవతా హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ఘనంగా కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి దేవస్థానం ప్రాంగణం నుంచి దేవస్థానం పురవీధుల గుండా కలశాలతో మహిళామూర్తులచే శోభయాత్రగా బయల్దేరి వీరబ్రహ్మేంద్ర పార్కులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి శిలామూర్తికి విశేష క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నొస్సం వెంకటాద్రిస్వామి, భద్రాద్రిస్వామి, దత్తాత్రేయస్వామి, శ్రీనివాసస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి నైవేద్యం మంగళహారతి తీర్థ పసాదాలు అందించారు.

కల్యాణ వైభోగమే..

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణ మహోత్సవాన్ని ఆస్థాన పండితులు ఘనంగా నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక జిల్లా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం రాత్రి గ్రామ పురవీధుల గుండా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మంగారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా తమిళనాడు రాష్ట్రం వాస్తవ్యులు జయరామన్, రవిచంద్రన్, సుందరరాజన్ తదితరులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖ కమిషనరు, మఠం మేనేజరు ఈశ్వరయ్యాచారి ఏర్పాట్లను నిర్వహించారు.



బ్రహ్మంగారికి క్షీరాభిషేకం చేస్తున్న వెంకటాద్రిస్వామి కుటుంబ సభ్యులు

స్వామివారి కల్యాణోత్సవ దృశ్యం





ఉత్సవాల్లో పాల్గొన్న మఠాధిపతి కుటుంబ సభ్యులు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఉపేంద్ర (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పోతబోలు గ్రామం సిద్దంగారి పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఉపేంద్ర (35) ఆదివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాలుకా పోలీసుల కథనం మేరకు... ఉపేంద్ర బెంగళూరు, హైదరాబాదు, మదనపల్లెలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. మూడేళ్ల క్రితం మదనపల్లె మండలం సీటీఎం గ్రామం మిట్టపల్లెకు చెందిన కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఉపేంద్ర పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శనివారం భార్య కృష్ణవేణిని అమ్మగారి ఊరు వెళ్లింది. ఆదివారం ఉదయం సిద్దంగారిపల్లెకు వచ్చి చూడగా భర్త ఉపేంద్ర ఉరి వేసుకోవడం చూసి కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదన పల్లె జిల్లా ప్రభుత్వాసుత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు.

అప్పుల బాధతో టైలర్...

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో టైలర్ వెంకటరమణ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌కు చెందిన కొండప్ప కుమారుడు వెంకటరమణ మదనపల్లె పట్టణంలో టైలర్ షాపు నిర్వహిస్తూ చిట్స్ వేసేవాడు. ఇతనికి ఇద్దరు కుమారైలు. భార్య రమణమ్మతో కలిసి ప్రశాంతనగర్‌లో ఉంటున్నాడు. ఆమె ఇళ్ల నిర్మాణ పనులకు ప్రతి రోజు వెళతోంది. ప్రతి రోజూ లాగే శనివారం పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో వెంకటరమణ ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటి వచ్చిన భార్య చూసి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆదివారం పోర్టుమాస్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ వివాదంలో మహిళకు గాయాలు

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూమి వివాదంలో జరిగిన ఘర్షణలో ఓ మహిళకు రక్త గాయాలు కావడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం పంచాయతీ నల్లంవారిపల్లిలో సర్వే నెంబరు 549-బి-6లో 3ఎకరాల 58సెంట్ల భూమిలో అదే గ్రామానికి చెందిన పి.రెడ్డెప్ప అతని కుటుంబ సభ్యులు వ్యవసాయం చేసుకుంటున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన పుంగనూరు భువనేశ్వరి ఆమె కుంటుబ సభ్యులు ఆ భూమి తన మామ రాజన్నకు చెందినదని, తమకు తెలియకుండా రెడ్డెప్ప తన పేరున మార్చుకొని అనుభవిస్తుండంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ అర్డరు తెచ్చుకొన్నట్లు తెలిపారు. కాగా భువనేశ్వరి పొలం వద్ద కు వెళ్లి చదును చేయిస్తుండగా రెడ్డెప్ప అతని కుమారుడు సతీష్, భార్య శాంతమ్మ, చెల్లెలు రెడ్డెమ్మ తనపై కొడవలితో దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉప్పలూరులో దారి విషయంపై ఘర్షణ

- ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు

కాశినాయన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన 12 మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఉప్పలూరు ఎస్సీ కాలనీకి చెందిన ముడమాలు శిఖామణి, మాదారి రాజారత్నం కుటుంబాలు దారి విషయంపై గత కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇక్కడ నడిచేదానికి లేదంటూ దారికి అడ్డుగా శిఖామణి గోడ పెట్టాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ నడుస్తున్నాము దారికి అడ్డుగా గోడ పెట్టవద్దంటూ రాజారత్నం మరి కొంతమంది అడ్డుచెప్పారు. ఈవిషయంపై కాలనీలోని పలు కుటుంబాలవారు రెండుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. అనంతరం నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు 6 మంది చొప్పున మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

శవాన్ని దొంగిలించడానికి యత్నం

- వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు


గోతిలో పూడ్చిన శవాన్ని బయటకు తీసిన దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలు నిర్వహించి పూడ్చిపెట్టిన ఓ శవాన్ని దొంగిలించడానికి ప్రయత్నం చేసిన ఘటన మదనపల్లె శివార ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... అంకిశెట్టిపల్లెకు వెళ్లే మార్గంలో శ్మశానం ఉంది. ఇందులో శనివారం ఓ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి వెళ్లారు. ఆదివారం సాయంత్రం రాజస్థాన్ రాష్ట్రం జయపూర్‌కు చెందిన గోవిందు అనే వ్యక్తి మట్టిని తవ్వి గోతిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తుండగా అటుగా వెళ్లే స్థానికులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా పోలీసులు అక్కడికి చేరుకుని నిందితున్ని విచారించారు. డెడ్‌బాడీ అవయవాల కోసం ఈ దారుణం చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వెంటనే నిందితున్ని తాలుకా పోలీసుస్టేసన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పూడ్చిన శవాన్ని దొంగలించడానికి ప్రయత్నించిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

కారుణ్య మరణానికి అనుమతించండి...!

- వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక..
- కలెక్టర్, ఎస్పీలకు ఓ వ్యాపారి విజ్ఞప్తి
- తన ఆవేదన వ్యక్తం చేస్తూ బోర్డు ఏర్పాటు

రైల్వేకోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారుణ్య మరణానికి అనుమతించాలంటూ రైల్వేకోడూరుకు చెందిన పాత సామాన్ల (గుజరి) వ్యాపారి తాటిగొట్ల మోహన్‌రాజు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం తన దుకాణం వద్ద తానుపడుతున్న బాధను వ్యక్త పరుస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరులో గత 20 ఏళ్లగా పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నానని తెలిపారు. గతంలో వ్యాపారం బాగానే సాగిందని, ఆ సమయంలో పది లారీలు తీసుకుని పూర్తిగా నష్టపోయి అప్పులయ్యాయని అన్నారు. రైల్వేకోడూరు పట్టణంలో వ్యాపారపరంగా మంచి పేరు సంపాదించుకున్నానని, అప్పులు చేసిన వడ్డీ వ్యాపారులకు ప్రతి నెలా వడ్డీలు సక్రమంగానే చెల్లించానని తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో వ్యాపా రం సాగలేదన్నారు. దీంతో వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పుకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక 2021లో ఐపీ పెట్టానని తెలిపారు. తిరిగి కొద్ది కొద్దిగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, వడ్డీ వ్యాపారులకు అప్పులు చెల్లిస్తున్నానని తెలిపారు. అయితే బాకీలు తీరుస్తున్నా వడ్డీ వ్యాపారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తనకు అనుమతి ఇస్తే కిడ్నీలు, కళ్లు, నా అవయవాలు అమ్మి వడ్డీ వ్యాపారుల బాకీలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నేను వడ్డీ వ్యాపారుల దగ్గర తీసుకున్న డబ్బులతో బయట ఆస్తులు తీసుకున్నానని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ నిర్వహించి నాకు ఎటువంటి ఆస్తులు, స్థిరాస్తులు ఉన్నా వడ్డీ వ్యాపారులకు ఇవ్వాలన్నారు. ఇది నా మరణ వాంగ్మూలంగా భావించి, తనకు న్యాయం చేయాలని కోరారు.


రైల్వేకోడూరులో బోర్డు ఏర్పాటు చేసిన మోహన్‌రాజు

బోరుబావుల్లో ఉబికి వస్తోన్న భూగర్భజలం


మహానందిపల్లె సమీపంలో బోరుబావి నుంచి బయటకు వస్తున్న నీరు

కలసపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మోటార్ స్విచ్ ఆన్ చేయకపోయినా బోరుబావుల నుంచి భూగర్భజలం ఉబికి బయటకు వస్తోంది. మండల పరిధిలోని పెండ్లిమర్రి, చెన్నారెడ్డిపల్లె, సిద్దమూర్తిపల్లె, మహానందిపల్లె, మావిళ్లపల్లె తదితర గ్రామాల్లో బోరు బావులతో పాటు పురాతన వ్యవసా య బావులలోంచి కూడా నీరు పొంగి పొలాల్లో ప్రవహిస్తున్నాయి. గత కొన్నేళ్ల నుంచి ఇలాంటి పరిస్థితి లేదని ఒక్కసారిగా భూగర్భ జలం పెరగడం సంతోషంగా ఉన్నా, మరో పక్క భూములు ఇప్పుడే ఆరక పంట సాగుకు ఆలస్యమయ్యే ఆందోళన ఉందని రైతులు అంటున్నారు.

5న కొండయ్యస్వామి జన్మదిన వేడుకలు



మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు ఈనెల 5వ తేదీ ఘనంగా నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లె ఊసయ్య ఆశ్రమానికి చెందిన కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం భారీ కేకు కటింగ్ ఉంటుందని, రాత్రి జబర్దస్త్ ఆర్టిస్టులచే కార్యక్రమం, సత్య హరిచంద్ర నాటకం, 6వ తేదీ రాష్ట్రస్థాయిలో వృష భరాజములచే ప్రత్యేక బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.3లక్షలు, రెండవ బహుమతి రూ.2లక్షలు, అలాగే పెద్ద బండలాగు పోటీలలో మొదటి బహుమతి రూ.1,58,118, రెండో బహుమతి రూ.1,08,118, మూడో బహుమతి రూ.75,118, నాల్గవ బహుమతి రూ.50,118, ఐదో బహుమతి రూ.25, 118 ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ పీఓ శచీదేవి, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగరాజు పేటలో కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి మార్గదర్శకత్వంలో వలంటీర్లు వీధుల్లో ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, వారానికి కనీసం ఐదు రోజులు అరగంట పాటు నడక, ప్రతిరోజు పది నిమిషాల ధ్యానం వంటి అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులు, ఎయిడ్స్, పొగతాగడం, మద్యపానం, మత్తుపదార్థాలతో అనర్థాలపై వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా అభినందించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయం వద్ద సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందాన అంటోందన్నారు. కార్మిక చట్టాలు మార్చడం, 13 గంటలు పని చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదన్నారు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరీ ఘోరమని తెలిపారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా కార్యదర్శులు కె.సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్, జి.చంద్రశేఖర్, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. దినట్లు కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు... ఆదివారం చెన్నూరుకు చెందిన ఎమ్.సూర్యచంద్ర (35) ద్విచక్రవాహనంలో పులివెందల రోడ్డు వైపు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఫాతిమా కళాశాల సమీపంలోకి రాగానే వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు


అష్కాన్ (కడప), తాహిర్ (కడప), మోక్షజ్ఞ (అనంతపురం)

కడప కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్స్ సబ్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. వివరా లిలా..

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజా రెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలు త బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 69.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 24 ఓవర్లలో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇందులో అష్కాన్ 31 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఓవర్ నైట్ స్కోరు 68 పరుగులతో రెండోరోజైన ఆది వారం బ్యాటింగ్ చేపట్టి 89.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 249 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో తాహిర్ 63 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 124 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 58 పరు గులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 58.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోరు 86 పరుగులు తిరిగి రెండ రోజు ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొత్తంగా 83.4 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో మోక్షజ్ఞ తేజ 84 పరుగులు చేయడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఇందులో షామీర్ 59 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి.. ఆపస్


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వివరిస్తున్న ఆపస్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని ఆపస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని ఆపస్ జిల్లా బృందం కలిసింది. సర్వీస్ రూల్స్ సాధనలో ఆయన చేసిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్తిస్థాయిలో సర్వీస్ రూల్స్ అమలు కావడానికి కృషిచేయాలని కోరింది. అలాగే 2010కి ముందు నియమితులైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుకారణంగా ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని ఆపస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శులు వెంకటరామిరెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, చంద్రమోహన్, బాలకృష్ణుడు, రఘుప్రసాద్, రెడ్డయ్యరెడ్డి, నాగమునీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి వెండి బిస్కెట్ వితరణ


వితరణ చేస్తున్న కర్ణాటక భక్తుడు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నివాసి వై.వీరప్ప ఒక కేజీ వెండి బిస్కెట్ బహూకరించారు. దాతలకు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగనాథేశ్వరుని కొండపైకి వాహనాలు బంద్

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- భక్తులు సహకరించాలి : సీఐ


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ వంశీధర్, చైర్మన్ సుమన్‌రెడ్డి

ఖాజీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పురష్కరించుకుని తెల్లవారుజామునుంచే నాగనాథేశ్వరుని దర్శించుకునేందుకు భారీగా భక్తులు కొండ పైభాగానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అయితే కొండ పైభాగంలో ఎక్కువ పార్కు చేసే స్థలం లేనందున వాహనాలను కింది భాగంలో నిలిపివేస్తు న్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు. ఆదివారం కొండ కింది భాగంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి అనంతరం సీఐ మాట్లాడుతూ కార్తీక మాసంలో సోమవారం మాత్రమే వాహనాలు పైకి అనుమతించబడవని, భక్తులు సహకరించాలని కోరారు. కాగా, కొండ కింది భాగం నుంచి పైకి వెళ్లడానికి ఆటోలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుమన్‌రెడ్డి అన్నారు. లేదంటే కాలి మార్గాన కొండ పైకి వెళ్లవచ్చన్నారు. భక్తుల కోసం కొండ కింది భాగంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ 2, 6, 7 యూనిట్ల ఆధ్వర్యంలో ఇడుపులపాయ, చింతలమడుగుపల్లె, వీరన్నగట్టుపల్లెల్లో ఏడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు ఆదివారం ముగిశాయి. సేంద్రియసాగు, కుటుంబ ఆరోగ్యం, పోషణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు

ఘనంగా భద్రావతి భావనారాయణ కల్యాణం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కడప చిన్న చౌక్‌లోనిపద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం భద్రావతి భావనారాయణ స్వాముల కల్యాణం, కార్తీక మాస సామూహిక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా దేవాదాయ శాఖాధికారి గంజి మల్లికార్జున మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలు, సేవాభావాన్ని పెంపొందిస్తా యన్నారు.

వైవీయూ విద్యార్థుల బొటానికల్ టూర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్ర ఓబులరెడ్డి, ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ఆదివారం కోయంబత్తూర్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్, తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్, దోబబెట్ట ప్రాంతాల్లో అరుదైన మొక్కలను సేకరించి, నమోదు చేసుకున్నారు.

స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రలు స్ఫూర్తిదాయకం

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కడప కల్చరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జీవిత చరిత్రలను భద్రపరచడం అవసరమని ఇలాంటి పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకుడిగా పనిచేస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి రాసిన కడప జిల్లా స్వాతంత్ర్య సమరయోధులు.. అలనాటి జ్ఞాపకాలు పుస్తకాన్ని. భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆదివారం స్థానిక యర్రముక్కపల్లెలోని బ్రౌన్ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహర్నిశలు ఎంతో శ్రమించి జీవితాలర్పించిన మహనీయులు సదా స్మరణీయులన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సర్వోన్నత న్యాయ స్థానముల న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయిప్రతాప, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, జానమద్ది విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కడప మారుతీనగర్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఏబీసీడీ కేటగిరీల వారీగా రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బాలకృష్ణయాదవ్ భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు విన్నవించారు. కడపలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సర్పంచ్ ఎంపీటీసీ వార్డుమెంబరు, జడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేట్ స్థానాల్లో బీసీలు కాకుండా మైనార్టీ వర్గానికి చెందినవారు నిలబడుతున్నారని ఆరోపించారు. మైనార్టీ ఓట్ల కోసం రాజకీయ నాయకుల వత్తిళ్లతో అధికారులు అత్యుత్సాహానికి ఒడిగడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రెడ్డిబాబు, శ్రీనివాసులు, చేలో రవి, హరినారాయణపాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె: కడప జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సభ్యులు, వీరనారీమణులు ఉపరాష్ట్రపతిని కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్ర మంలో అధ్యక్షుడు దాసరి రమణయ్య, ప్రధాన కార్యదర్శి బి.వి.గోపాల్‌రెడ్డి, ఖజాంచి డి.కిరణ్‌కుమార్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్సీ రామ గోపాల్ రెడ్డి అన్నారు. ఆది వారం ఆయన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడమే కాకుండా, నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి మరువలేనిదన్నారు. దాదా పు 40 మందికి రూ.46 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మోపూరి దేవస్థానం చైర్మన్ ఓబుల్‌రెడ్డి, బొజ్జా మైసూరారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

కడప మారుతీనగర్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రకాష్‌నగర్‌లో గల జేసీబీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కుటుంబాలకు ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

శిల్పారామంలో స్టెప్పుల హోరు

కడప కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పా రామంలోని సాంస్కృతిక కళావేదికపై ఆదివారం కడపకు చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జానపద, సినిమా పాటలకు చేసిన నృత్యాలు హోరెత్తించాయి. వరాలు నా వరాలు, వస్తావా జానకి, మీసాల పిల్ల అనే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ శిల్పారామం పరిపాలనాధికారి ఎస్.క్రిష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

మొంథా తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న చామంతి తోటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పంటల బీమా, పెట్టుబడి రాయితీ పరిహారం చెల్లించాలని ఈనెల 6న జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల వద్ద జరిగే ఆందోళన జయప్రదం చేయా లని జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 వేల ఎకరాలలో వరి, మిను ము, కంది, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, నువ్వుల పంటలతోపాటు, పదివేలకు పైగా ఎకరాల్లో ఉల్లి, మిరప, టమోటా లాంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయ న్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం సవాలక్ష షరతులు పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. పంటల బీమా.. పెట్టుబడి రాయితీతో పాటు ప్రత్యామ్నయ పంటలకు కావాల్సిన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు రాయితీపై మం జూరు చేయాలన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు వ్యవసాయ రుణాలపై మారటోరియం ప్రకటించి, కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

చామంతి రైతును ఆదుకోవాలి

సీకేదిన్నె: తుఫాను కారణంగా నష్టపోయిన చామంతి పూల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లెలో ఆదివారం తుఫాను ధాటికి దెబ్బతిన్న చామంతి పూలతోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తుఫాను ప్రభావిత జాబితాలో కడప జిల్లా పేరును చేర్చకపోవడం అన్యాయమన్నారు. బద్వేలు డివిజన్‌లో 8 మండలాల్లో తుఫాను ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కడప జిల్లాలో అధిక వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న చామంతి పూలు, అరటి, వరి, మొక్కజొన్న పంట, వెన్నుదశలో ఉన్న వరి నేలకొరిగాయన్నారు. దెబ్బతిన్న అన్ని పంటలను గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. దస్తగిరెడ్డి, సిద్దయ్య, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఎంత దానం చేసినా తరగనిది విద్య

పులివెందుల రూరల్, నవంబరు2 (ఆంధ్ర జ్యోతి): ఎవరూ దోచుకోలేనిది.. ఎంత దానం చేసినా తరగనిది విద్య అని యోగివేమన యూని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫె సర్ ఎన్.వెంకట రామిరెడ్డి, పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు. శ్రీనిత తెలిపారు. ఆదివారం పులివెందుల జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నాలుగో రోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారసత్వంగా ఎన్ని కోట్లు వచ్చినా ఉంటాయో లేదో తెలియదు గాని అక్షర జ్ఞానం ఎవరూ దోచుకెళ్లలేరన్నారు. ఎంతమందికి దానం చేసినా తరగని నిధి అక్షర జ్ఞానం అన్నారు. చదువు సంస్కారాన్ని నేర్పుతుంది, విజ్ఞానాన్ని అందిస్తుంది నలుగురిలో విలువ పెంచుతుంది, మనిషి జీవితానికి దారి చూపుతుందన్నారు. అక్షర జ్ఞానం ప్రతి ఒక్కరికి విలువ ఇస్తుందని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

వల్లూరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా మండల కేంద్రంలోని భవానీ శంకరాలయంలో ఆదివారం భవానీ శంకరులకు పంచామృతా భిషేకాలు, దేవీ ఖడ్గమాల పఠనం కుంకుమార్చన చేశారు. ప్రదోషకాలంలో తులసి కోటను సుం దరంగా అలంకరించి, దీపాలు వెలిగించి కుంకుమార్చన చేశారు. వ అమ్మవారికి నివేదన చేసి మంగళహారతి ఇచ్చి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు

సీకేదిన్నె: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆదివారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో తులశమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి చెట్టుకు అలంకరణ చేసి మహిళలు వాయనాలు ఇచ్చి పసుపు కుంకుమలతో చల్లగా చూడాలని వేడుకున్నారు. మండలంలో మహిళలు తులసి పూజను ఘనంగా నిర్వహించుకున్నారు.

కాశీబుగ్గ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ దుర్ఘటన మృతులకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లలకు బైకులు ఇస్తే చర్యలు

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు బైకులు ఇవ్వడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు హెచ్చరించారు.స్థానిక బిడాలమిట్టలో ఆదివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లకు అడ్డుకట్ట

పులివెందుల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధితో తెగుళ్లను అరికట్టవచ్చని మండల వ్యవసాయ అధికారి వి.చెన్నా రెడ్డి సూచించారు.ఆదివారం రాగిమాని పల్లె, ఎర్రిపల్లె ల్లో సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. మండ లంలో 282 క్వింటాళ్ల శనగ విత్తనాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

● ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ● కదలిన అధికార యంత్రాంగం ● బద్వేలులో మురుగుకాలువల ఆక్రమిత పనులు వేగవంతం

బద్వేలు,నవంబర్ 2, (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో ఎట్టకేలకు మురుగు కాల్వల ఆక్రమణలకు అధికార యంత్రాం అడ్డుకట్టవేస్తోంది. ఆమేరకు ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. రోజురోజుకు పట్టణం విస్తరించి జనసందోహం పెరుగుతున్నా అందుకు తగ్గట్లుగా పట్టణంలో మౌలిక వసతులు కల్పించడానికి వీలుకలగడంలేదు. పేరుకే మున్సిపాలిటీ స్థాయి పెరిగిందే తప్ప అందుకు తగ్గట్లుగా వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారు విఫలం చెందారన్న విమర్శలు వినవస్తున్నాయి. కొంతకాలం క్రితం ప్రధాన రోడ్డు విస్తరించిన రోడ్డు పొడవునా డ్రైనేజీలు కనిపించకుండా ఆక్రమించుకోవడంతో విస్తరించిన రోడ్లు కూడా చిన్నవిగా కనిపించడమే కాదు ఆక్రమణలతో డ్రైనేజీలు నిండిపోయి చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచి కుంటలా మారుతున్నాయి. బద్వేలు చుట్టూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవడం అటుంచితే పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి నలువైపులా డ్రైనేజీలు సైతం వదలకుండా ముందుకు సాగడంతో డ్రైనేజీ అస్తవ్యస్థంగా మారింది. మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ వద్ద వర్షం వస్తే రోడ్డు వెంట నీరు కుంటను తలపిస్తోంది. అలాగే నెల్లూరు రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద , సిద్దవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు వద్ద నీరంతా రోడ్డుపై నిలిచి బద్వేలు ఆర్టీసీ గ్యారేజీలోకి వెళ్లడంతో అక్కడి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు , అధికారులు డ్రైనేజీలపై దృష్టిసారించకపోవడంతో వర్షం వచ్చినపుడల్లా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపై చేరుతుండడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్ బద్వేలు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టిసారించడమే కాకుండా స్వయంగా డ్రైనేజీ కాలువలను పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.



నెల్లూరురోడ్డులోని డ్రైనేజీ పై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్న కమిషనర్



డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బద్వేలు ఆర్డీవో తదితరులు (ఫైల్‌ఫొటో)

ఆక్రమణలపై గురిపెట్టిన అధికారులు: కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు దృష్టిసారించారు. మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ దగ్గర డ్రైనేజీ కాలువ లపై ఆక్రమణలను కొన్నింటిని తొలగించి ఆ ప్రాంతంలో డ్రైనేజీ కాలువను శుభ్రపరిచారు. నెల్లూరు రోడ్డులోని డ్రైనేజీ పై కట్టిన ఆక్రమిత కట్టడాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. సిద్దవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్నషాపుల యజమానులతో ఆర్డీవో ,మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని, డ్రైనేజీపై నిర్మించిన ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా, ప్రలోభాలకు తావివ్వకుండా డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. మరి అధికారులు డ్రైనేజీపై నెలకొన్న ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించి పట్టణ ప్రజలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతారో, లేదో వేచి చూడాల్సిందే.

ముక్తిరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ముక్తిరామలింగేశ్వరస్వామి తెప్పోత్సవం సందర్భంగా హారతి ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ముక్తిరామలింగేశ్వరస్వామి, గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు సుందరంగా అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పెన్నాతీరంలో స్వామివారికి కన్నుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ఆలయాల్లో కార్తిక పూజలు



బాలప్పకోనలో కొలువుదీరిన బాలమల్లేశ్వరుడు

కొండాపురం,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం రెండవ సోమవారం సందర్భంగా పలు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మండలంలోని ప్రసిద్ద శైవక్షేత్రాలైన బాలప్పకోన, మల్లేశ్వరకోనతో పాటు గండ్లూరు, కొండాపురం తదితర చోట్ల శివాలయాల్లో వేకువ జాము నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. బాలప్పకోనలో కార్తిక మాసం ముగిసేవరకు అఖండ దీపారాధన, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కాంట్రాక్టర్ మిట్టా బాల భాస్కరొరెడ్డి తెలిపారు. బొందలదిన్నె నుంచి సంకేపల్లే వరకు బ్రిడ్జి పక్కనే పెన్నానదిపై తాత్కాలికంగా రోడ్డు వేశారు. అదేవిధంగా మల్లేశ్వరకోనలో కూడా దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఆకాశదీపం పూజలు



ఆకాశదీపానికి పూజలు చేస్తున్న భక్తులు

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల బ్రాహ్మణవీధిలోని బాలా త్రిపుర సుందరీదేవి రామలింగస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం ఆకాశదీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని ఆకాశ దీపం దర్శంచుకున్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, ధర్మకర్త సత్యనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర రెడ్డి, తులసి సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు తాళ్లప్రొద్దుటూరులో కలెక్టర్ పర్యటన

కొండాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించనున్నట్లు మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి తెలిపారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలు కూడా వస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు తాళ్లప్రొద్దుటూరులో గండికోట ముంపు సమస్యలపై జరిగే సమావేశంలో వారు పాల్గొంటారని తెలిపారు. గండికోట ముంపు గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

2003 ఉపాధ్యాయుల పెన్షన్‌పై సీఎంతో చర్చిస్తా

● మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో సమావేశమైన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తామని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీ వేత్త జానుమద్ది హనుమత్‌శాస్త్రి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయనను ఆదివారం కడప స్టేట్‌గెస్ట్‌హౌస్‌లో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 కన్నా ముందు ఉపాధ్యాయ నియామకాలపై నోటిఫికేషన్ వెలువడిందని, అయితే నియామకాల ప్రక్రియ ఆలస్యమైందని దీంతో తమకు సీపీఎస్ విధానం అమలు చేస్తున్నారన్నారు. నియామకాలు ఆలస్యమైనవారికోసం కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీ చేయడానికి వెంకయ్యనాయుడు ఎంతో కృషి చేశారని మన రాష్ట్రంలో కూడా మెమో 57ను త్వరగా అమలు చేయడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి పాత పెన్షన్ అమలు అయ్యేవిధంగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబరులో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మహాసభలు

బద్వేలు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర మహాసభలు కడప నగరంలో డిసెంబరు 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ బద్వేలు ఏరియా కమిటీ సభ్యులు తెలిపారు. ఆమేరకు ఆదివారం పట్టణంలోని మార్తోమనగర్‌లో ఆ పార్టీ నాయకులతో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ బద్వేలు ఏరియా కమిటీ నేత కె.బాబు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో దాదాపు 20 ఏళ్లగా మార్తోమనగర్‌లో నిరుపేదలు నివశిస్తున్నారని నాటి నుంచి నేటి వరకు ఇక్కడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడేనన్నట్లుగా ఉందన్నారు. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్లు మంజూరు చేస్తే నామమాత్రంగా ఖర్చు పెట్టి తమకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్య దోరణి ఎందుకని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మహాసభలు నర్విహిస్తున్నామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యామేలు, బాలుడు, ఎం.బాబు, ప్రసాద్, చిట్టి, నవీన్, రాజు, చంటి పాల్గొన్నారు.

బద్వేలులో హిందువుల ఐక్యతా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న హిందువులు

బద్వేలు , నవంబర్ 2, (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని ఓంకార క్షేత్ర అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఆదివారం కులాల కతీతంగా హిందువుల ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా హిందువులందరూ కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైంది. అందరూ జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొని హిందువుల ఐక్యతను చాటారు. ర్యాలీ అనంతరం వనబోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా గోమాత కల్యాణోత్సవం



గోమాత-వృషభరాజులకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లోకకళ్యాణార్థం పెన్నాతీరాన వెలసిన సంతోషిమాత ఆలయంలో గోమాత కల్యాణోత్సవం ఆదివా రం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు చాగంటి ప్రసాదశర్మ, పార్వతి దంపతులు ఆధ్వర్యంలో అబిజిత్ లగ్నంలో వందలాదిమంది భక్తులు చూస్తుండగా ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. గోమాత-వృషభరాజములను కోలాటం, భజన బృందాలతో, భక్తులు పుష్పాభిషేకం చేస్తూ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఆలయంలో పండితులు కళశస్థాపన చేసి, వేదమంత్రా లతో పూజలు నిర్వహించి కళ్యాణదారణ చేశారు. భక్తులకు గోవృషభముల దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కల్యాణాత్సవానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. గోవృషభ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు బారీగా తరలివచ్చారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

ఖాజీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటిమీదపల్లె సమీపంలో ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ వంశీదర్ అన్నారు. ఆదివారం అంకాళమ్మ గుడికి వెళ్లే దారిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి వద్ద రూ.2,600 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

దళితుల సమస్యలపై ర్యాలీ

జమ్మలమడుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో ఈనెల 5వ తేదీ బుధవారం దళితులు, బడుగు, బలహీన వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రతినెల పౌర హక్కుల దినోత్సవం జరపాలని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి నిరసన తెలిపారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయంలోని ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం ఇవ్వడం జరుగుతోందన్నారు. కావున ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షుడిగా సత్యనారాయణ



దేవస్థానం అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సత్యనారాయణ

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండల ంలోని కొరపాటిపల్లె పంచాయతీ కాల్వకట్ట తిరుమలగిరి లక్ష్మీదేవి, గోదాదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరసావమి దేవస్థానం అధ్యక్షుడుగా చాటకొండు సత్యనారాయణ నాల్గవ సారి తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ఆలయ కార్యదర్శిగా చాటకొండు సుధాకర్ క్యాషియర్‌గా ఓబయ్య గుప్తలను ఎన్నుకున్నారు.


సర్వే ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఎన్నిక

జమ్మలమడుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం జమ్మలమడుగు యూనిట్ ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు సంబంధించి ముందుగా సర్వే డిపార్టుమెంట్‌కు సంబంధించి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు అధ్యక్షుడు గురుశేఖర్ తెలిపారు. నూతన అధ్యక్షుడుగా డి.గురుశేఖర్ (జమ్మలమడుగు), ఉపాధ్యక్షుడుగా ఐజే రాజేష్ (మైలవరం), సెక్రటరిగా డి.లక్ష్మిప్రసన్న (ఎర్రగుంట్ల), జాయింట్ సెక్రటరిగా జి.గంగాధర్ (పెద్దముడియం), ట్రెజరర్‌గా డి.సాయిలత (మైలవరం), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రాజశేఖర్, ఆర్.విజయభాస్కర్, సాయి వెంకటేష్, టి.జానకీ, కె.హరి, ఎ.నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పోరుమామిళ్లలో కోటి సంతకాల సేకరణ

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ ఆదివారం రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, నాగార్జునరెడ్డి, పోలింగ్‌బూత్ కన్వీనర్లు కల్లూరు రమణారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో చిత్త గిరిప్రణీత్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, ఆదిబోయిన కొండయ్య, చాపాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు కన్నీళ్లు



దువ్వూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్ద బళ్లారి ఉల్లి సాగు చేసిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తుఫాను ప్రభావం వారిని గుల్ల చేసింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు కొనుగోలుకు ఎవరు ముందుకు రాకపోవడంతో అల్లాడుతున్న రైతులను తుఫాను మరింత దెబ్బతీసింది. పంట తొలగించిన పొలాల్లో ఉంచిన ఓదేలు వానలో మగ్గి గడ్డలు కుళ్లిపోయిన సంఘటనలు అక్కడక్కడ ఉన్నాయి. ఇలా పంట తీసిన పొలాల్లో 60 శాతం గడ్డలు కుళ్లాయని రైతులు కుమిలిపోతున్నారు. దువ్వూరుతోపాటు మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, బి.మఠం మండలాల రైతులది ఇదే పరిస్థితి. నియోజకవర్గంలో 4,845 ఎకరాల్లో పంట సాగైనట్లు ఉద్యానవన శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. ఎకరాలో పంట చేతి కందేవరకు రైతులకు 50 నుంచి 60 వేల పెట్టుబడులు పెట్టారు. ఎకరాలో 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనేది ప్రాథమిక అంచనా. పలుకరించకుండానే వచ్చే వానలు వారికి చెడుచేసే అతిథులుగా మారాయి.

ప్రభుత్వం దృష్టికి ఉల్లి రైతుల సమస్యలు

కలెక్టర్ ద్వారా ఉల్లి రైతుల పరిస్థితి వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఉద్యానవన శాఖ ద్వారా సాగు విస్తీర్ణంపై అధికారులకు తెలియజేశాం. పరిహారం విషయం మాకు తెలియదు.

-రామకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి, మైదుకూరు

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం తీసుకువెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం కవలకుంట్ల వద్ద అనుమతులు లేకుండా మదన బాలసుబ్బయ్య అనే వ్యక్తి పది మద్యం బాటిళ్ల తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.